క్లుప్తంగా

సాహితీ బ్రహ్మోత్సవాలకు బెన్నమ్మ ఎంపిక



కర్నూలు(అర్బన్): తిరుపతిలో ఏప్రిల్ 9, 10వ తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల కార్యక్రమ కమిటీకి స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న రచయిత్రి బైరపోగు బెన్నమ్మ సభ్యురాలుగా ఎంపికైంది. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. గురువారం బెన్నమ్మ విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో 20 మందిని ఎంపిక చేశారని, అందులో కర్నూలు జిల్లా నుంచి తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. కమిటీకి తనను ఎంపిక చేయడం పట్ల రచయితగా తనకు సహకారం, ప్రోత్సాహం అందిస్తున్న వారందరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలి ఫిజీషియన్ విధానం వరం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలి ఫిజీషియన్ విధానం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒక వరమని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. గురువారం ఆయన గార్గేయపురం పీహెచ్‌సీ పరిధిలోని పసుపుల గ్రామంలో ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఓపీకి వచ్చిన రోగులకు అవసరమైన రక్తపరీక్షలు, మందులు అందించాలని తెలిపారు. మధ్యాహ్న సమయంలో ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులను సందర్శించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అంతేగాక ఈడీడీ క్యాలెండర్‌లో ఉన్న హైరిస్క్ గర్భవతులను ప్రసవానికి ఒక వారం ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవం అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శిశువుకు అంత్యక్రియలు




అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం, అనాథ శిశువు మృతదేహం

కర్నూలు కల్చరల్: రెండు నెలల వయసు గల అనాథ బాలిక ప్రకృతి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. దీంతో బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి గురువారం ఆసుపత్రిని సందర్శించి శిశు గృహ, బాలల పరిరక్షణ సమితి అధికారులతో మాట్లాడి అనాథ శిశువుకు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మానవతా సంస్థ అంబులెన్స్‌లో మృతదేహాన్ని నగరంలోని జమ్మిచెట్టు ప్రాంతంలో ఉన్న శ్మశాన వాటికకు తరలించి ఖననం చేశారు. బాలల పరిరక్షణ సమితి సభ్యులు ఎస్.మురళీకృష్ణ, శిశు గృహ మేనేజర్ మెహతాజ్, ఐసీపీఎస్ ప్రొటెక్షన్ అధికారిణి ఎం.దీపారాణి, భజరంగ్ దళ్ నగర సురక్షప్రముఖ్ పి.ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగాలి

కర్నూలు: కుటుంబ నిర్వహణలో వచ్చే సమస్యలను ఎదుర్కొంటూనే మహిళలు ముందుకు సాగాలని జేవీవీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి తేజోమయి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమత (జేవీవీ మహిళా విభాగం) ఆధ్వర్యంలో గురువారం ఆర్‌సీ రెడ్డి కళాశాలలో మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 8 ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి హరిత, రాష్ట్ర నాయకురాలు సుజాత మాట్లాడారు.

రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు అనంతపురం పట్టణంలో నిర్వహిస్తున్న 11వ హాకీ ఆంధ్రప్రదేశ్ బాలికల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చాటి విజేతగా తిరిగి రావాలని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ అన్నారు. గురువారం స్థానిక దామోదరం సంజీవయ్య స్మారక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా సబ్ జూనియర్ బాలికల హాకీ టీమ్‌ను ఆయన అభినందించారు. హాకీ అసోసియేషన్ కర్నూలు ఉపాధ్యక్షులు ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్,బలగం , సార్, వినరో భాగ్యము విష్ణు కథ,ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, సార్, బలగం, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, బలగం , వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా,గ్రంథాలయం, క్రీడ్ -3
భరత్ కాంప్లెక్స్ : మిరపకాయ్
రాజ్ : మిస్టర్ కింగ్
శ్రీరామ : బిగ్ స్నేక్ కింగ్ , గ్రంథాలయం
విజయ : వినరో భాగ్యము విష్ణు కథ






నందనవనం.. సైన్స్ పరిమళం




కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 20వ వార్డు అమ్మ హాస్పిటల్ సమీపంలో సైన్సు పార్కును అద్భుతంగా తీర్చిదిద్దారు. రూ.1.87 కోట్లు జనరల్ ఫండ్ నిధులతో నిర్మించిన ఈ నందనవనం నగరంలోనే ఆదర్శంగా నిలుస్తుంది. ప్రముఖ శాస్త్రవేత్తలు గెలీలియో, ఆర్యభట్, స్టెఫీన్ హాకింగ్, నంబి నారాయణ్, జానకీ అమ్మాళ్, డాక్టర్ రామన్ పరిమళ, అబ్దుల్ కలామ్ తదితరులతో చిత్రాలతో పాటు సైన్స్‌కు సంబంధించిన స్కేల్, గ్లోబ్, బయో స్కోర్, బెల్, కారు డ్రైవింగ్, ఆట వస్తువులు, పచ్చదనంతో కనువిందు చేస్తోంది. పిల్లలకు పరిశుభ్రత, చదువు ప్రాధాన్యత, సైన్స్ ఇలా... ఎన్నో విషయాలు తెలియజేసేలా పార్కును తీర్చిదిద్దారు. త్వరలోనే దానిని ప్రారంభించేందుకు నగరపాలక అధికారులు చర్యలు చేపట్టారు.

–సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు





కమనీయం.. శ్రీరంగనాథుని కల్యాణం



వేడుకలో పాల్గొన్న భక్తులు



గోదా రంగనాథ స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కర్నూలు కల్చరల్: కర్నూలు శివారు మామిదాలపాడు సమీపంలోని శ్రీగోదా గోకులంలో శ్రీరంగనాయకి గోదా సమేత రంగనాథ స్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. గురువారం పాంచరాత్ర ఆగమ శాస్త్ర పద్ధతిలో నిర్వహించారు. మూలమూర్తుల కల్యాణానంతరం ఉత్సవమూర్తులను కడు శోభాయమానంగా అలంకరించి కల్యాణ క్రతువు చేపట్టారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో భక్త జనసందోహం మధ్య వేడుక జరిగింది. కార్యక్రమంలో ప్రయాగరాజ్ ప్రపర్ణ రాఘవ జీయర్ స్వామీజీ, తోట్లపల్లి అచలానంద ఆశ్రమ పీఠాధిపతులు విరజానంద స్వామీజీ, గోదాగోకులం వ్యవస్థాపక చైర్మన్ మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, వేద పండితులు శ్రీమన్నారాయణచార్యులు, మాధవాచార్యులు, భగవాన్ ఆచార్యులు, గోదా గోకులం సభ్యులు, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గోదాగోకులం పరివారంతో పాటు వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీల అభ్యున్నతి




సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య, సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధిస్తాం
- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

కల్లూరు: రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం సాయంత్రం కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు, కల్లూరు గ్రామీణ ప్రాంతానికి చెందిన ఎంపీటీసీలతో ఎమ్మెల్యే కాటసాని నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ తరుపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ బోయ మధుసూదన్‌ను కార్పొరేటర్లుకు, గ్రామీణ ప్రాంతాల నాయకులకు, ఎంపీటీసీలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ప్రీఫైనల్ లాంటివన్నారు. స్థానిక సంస్థల్లో టీడీపీకి బలం లేకపోయిన ఆ పార్టీకి చెందిన వారి చేతనే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేయించిందన్నారు. ఎన్నికల్లో ఎలాగో ఓడిపోతామని తెలుసుకున్న టీడీపీ నాయకులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పేరును కూడా నామినేషన్‌లో కనపర్చలేని స్థితిలో ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలో మొత్తం 1,178 మంది ఓటర్లు ఉన్నారని అందులో 1030 వైఎస్సార్‌సీపీకి చెందిన వారేనన్నారు. టీడీపీకి కేవలం 127 ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. అలాగే పట్టభద్ర, టీచర్ల ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిల గెలుపునకు అందరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బోయ మధుసూదన్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అందరూ ఎమ్మెల్యేలు సహకరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుస్తాననే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో కల్లూరు మండల అధ్యక్షురాలు బోయ శారద, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లావెంకట రమణారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్(మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్) కేశవరెడ్డి, కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు, మండల స్థాయి నాయకులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

☛ **223 మంది రక్తదానం**

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఆయన నివాసం వద్ద అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా కర్నూలు నందికొట్కూరు, పగిడ్యాల, ముచ్చుమర్రి తదితర ప్రాంతాల్లో 223 మంది రక్తదానం చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

☛ **పనులు వేగవంతం చేయండి**

కర్నూలు (టౌన్): నగరంలోని జొహరాపురంలోని పాత డంప్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. గురువారం స్థానిక డంప్ యార్డులో ఆయా పనులు చేస్తున్న సృష్టి కాన్‌టెక్ సంస్థ మేనేజర్ తివారీతో కమిషనర్ పనుల ప్రగతి గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ శేషాసాయి, ఈఈ షాకీర్ అహమ్మద్, ఏఈ రసూల్ పాల్గొన్నారు.

☛ **వైద్య వృత్తిలో నైతికత ప్రధానం**

కర్నూలు(హాస్పిటల్): వైద్యవృత్తిలో ఉంటున్న వారికి నైతికత ప్రధానమని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ జి.సుధాకర్ చెప్పారు. గురువారం సాయంత్రం కర్నూలు మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్లకు మెడికల్ ఎథిక్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో వైద్యులు పాటించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ **పోస్టల్ ఉద్యోగులపై టార్గెట్లు ఆపాలి**

కర్నూలు(రాజ్‌విహార్): పోస్టల్ ఉద్యోగులపై రోజురోజుకు పెరుగుతున్న ఒత్తిళ్లు ఆపాలని జీడీఎస్ పీజేసీఏ చైర్మన్ కె.మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లక్ష్మీకాంత్, మొహమ్మద్ జానీ, నగేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'సీపీటీ'ని నిర్వహించొద్దు

కర్నూలు(సెంట్రల్): ఏపీపీఎస్‌సీ నిర్వహించే గ్రూపు-2,3 పోస్టుల భర్తీలో కంప్యూటర్ ప్రొఫెషియన్సీ టెస్టు(సీపీటీ)ను నిర్వహించరాదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాటాడారు. కార్యక్రమంలో బీసన్న, సోమన్న పాల్గొన్నారు.

5న గుండె జబ్బులపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ఎ.క్యాంప్‌లోని హెల్త్ క్లబ్‌లో ఈనెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు గుండె జబ్బులపై కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.వసంత కుమార్ అవగాహన కల్పిస్తారని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): ఈశాన్యరాష్ట్రాల ఎన్నికలు ముగియగానే వంట గ్యాస్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై 350 పెంచడం అన్యాయమని, నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన సమయంలో రూ.430 ఉన్న సిలిండర్ ధర రూ.1200 చేరిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

బాలోత్సవ వేడుకల్లో ప్రతిభ

కర్నూలు కల్చరల్: మాధవి నగర్ రవీంద్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్, వెన్నెలా కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన 'బాలోత్సవ్' పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారని, దీంతో వారిని కరస్పాండెంట్ పి.బి.వి.సుబ్బయ్య గురువారం అభినందించారు.

షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు గుంటూరులో నిర్వహిస్తున్న 41వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జాతీయ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారిణీలను సీఈఓ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన శిక్షకులు నటరాజరావు, షూటింగ్ బాల్ కార్యదర్శి ఈశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సమాచారం కోసం కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ జయమ్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని డ్వామా కాన్ఫరెన్స్ హాలులో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఇందులో ఎన్నికల సమాచారం కోసం మీడియా ప్రతినిధులు సందర్శించాల్సిందిగా ఆమె కోరారు.

పారదర్శకంగా విద్యుత్ బిల్లులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు పారదర్శకంగా తీసేందుకు చర్యలు చేపట్టామని కర్నూలు టౌన్ ఏడీఈ-1 రాజమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారీ బిల్లులు తీయడంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత ఏఈలపై ఉందని చెప్పారు.

షోకాజ్ నోటీసులు విరమించుకోవాలి

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను విరమించుకోవాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛా వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెంటనే విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో వీటికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరిమానందం, జిల్లా గౌరవాధ్యక్షుడు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి




ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహిస్తున్న వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎస్‌వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు సంబంధించిన అన్ని డిమాండ్‌లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శాసనమండలి సభ్యుడు, ప్రభుత్వ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టభద్రుల శాసనమండలి సభ్యుడిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పలువురు విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థ, జిల్లా ఖజాన కార్యాలయం, ఉద్యాన శాఖ, పశుసంవర్ధకశాఖ, సెరికల్చర్, డీఆర్‌డీఏ-వైకేపీ, స్టేట్ ఆడిట్, ఏపీజీఎల్ఐ తదితర కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రచారం

కర్నూలు(రాజ్‌విహార్): త్వరలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. గురువారం కుమ్మరి వీధిలో ఆయన మండలి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యా సంస్థలు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లకు వెళ్లి వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిది సంక్షేమ ప్రభుత్వమని, ఆయన బలపరచిన అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కర్నూలు: కర్నూలు శివారులోని పుల్లారెడ్డి డెంటల్ కళాశాల సమీపంలోని జేపీ మార్బుల్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కమలాపురం కొట్టాలపల్లి తండాకు చెందిన సోమనాథ్ నాయక్ (23) తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఇతను ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. స్నేహితుని వివాహ వేడుకలో పాల్గొని రాయలసీమ యూనివర్శిటీలో ఉన్న స్నేహితుని వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నంద్యాల వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో తలకు, నుదుటిపై బలమైన గాయాలయ్యాయి. అదే కారులో ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. మృతుని తండ్రి శంకర్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలు అర్బన్ తాలూకా పీఎస్ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

గంజాయి స్వాధీనం

కర్నూలు: కర్నూలు నగరం బుధవారపేటకు చెందిన పాత నేరస్తుడు గుజరాతీ శ్రీనివాసులు దగ్గర పోలీసులు 1150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈయన గత కొన్నేళ్లుగా ఇంటి దొంగతనాలు, సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసు రికార్డులకెక్కాడు. బుధవారపేటలోని భవానమ్మ గుడి దగ్గర సైకిల్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి కొంతకాలంగా గంజాయి విక్రయం కూడా జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో నిఘా వేసి పట్టుకున్నారు. నంద్యాల నుంచి కర్నూలుకు గంజాయి తీసుకుని వస్తుండగా నంద్యాల రోడ్డులోని మధు లోక్ బార్ (మిత్ర ధాబా) వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 1150 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు మూడవ పట్టణ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్లాస్టిక్ పరిశ్రమ గోడౌన్ సీజ్



గోడౌన్‌లో పెద్దసంఖ్యలో ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం చేసుకున్న అధికారులు

కర్నూలు (టౌన్): నగర శివారులోని దూపాడు వద్ద ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ వస్తువులు తయారు చేసే గోడౌన్‌ను అనుమతుల్లేకుండా నిర్వహిస్తుండటంతో గురువారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలక రెవెన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. దాదాపు రెండు టన్నులు సామర్థ్యం కలిగిన ప్లాస్టిక్ గ్లాస్‌లను స్వాధీనం చేసుకొని గోడౌన్‌ను సీజ్ చేశారు. దాడుల్లో నగర పాలక ప్రజారోగ్యాధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, ముర్తుజావలీ పాల్గొన్నారు.

ప్రణాళికతో పన్నుల వసూళ్లు

కర్నూలు (టౌన్): కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక రెవెన్యూ సిబ్బంది పన్నుల వసూళ్ల వేగం పెంచింది. గురువారం ఒక్క రోజు నగరంలో ఆస్తిపన్ను రూ.31,44,259, నీటిపన్ను రూ.7,84,895లు వసూలు చేశారు.' మరో 28 రోజులు గడిస్తే 2022-2023 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. దీంతో పన్నుల వసూళ్లపై నగరపాలక రెవెన్యూ యంత్రాంగం దృష్టి పెట్టింది. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి సచివాలయంలో టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లు ప్రణాళికతో పన్నులు వసూలు చేస్తాయి. రెవెన్యూ అధికారులు జునీద్, వీరస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అబ్దుల్ వాజిద్, సాధిక్ హుస్సేన్, మన్సూర్ బాష, సుహేయిల్ అహమ్మద్, రాజు, శ్రీకాంత్ ఖలీల్ రెహమాన్‌ల పర్యవేక్షణలో పన్ను వసూళ్లు చేస్తున్నారు.

కుళాయి కనెక్షన్ల తొలగింపు :

ఆస్తిపన్ను బకాయిలు రూ.33 కోట్లు ఉంది. కాగ నీటి పన్ను బకాయిలు డిమాండ్, ఆరియర్స్‌తో కలిపి రూ.12 కోట్లు ఉంది. ఇప్పటికే పన్ను దారులను గుర్తించిన రెవెన్యూ విభాగం సిబ్బంది నోటీసులు జారీ చేశారు. స్పందించని వారితో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్ బకాయిలు ఉన్న వారి ఇళ్లను గుర్తించి ఇంటి కుళాయి కనెక్షన్లు తొలగించారు. రాబోయే రోజుల్లో తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తామని నగర పాలక అడిషనల్ కమిషర్ రామలింగేశ్వర్ వెల్లడించారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అప్పజెప్పాలని సీపీఐ నాయకులు జగన్నాథం, మునెప్ప, మనోహర్ మాణిక్యం డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ..సీపీఐ తలపెట్టిన చలో విజయవాడకు పోలీసులు ఒకపక్క అనుమతులు ఇచ్చి..మరోపక్క అక్రమ గృహ నిర్బంధాలు చేయడం సబబు కాదన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోదన్నారు.